కథా నిలయం
1600
శ్రీకాకుళం

# అగ్నిపర్వతం

"టింగ్ టింగ్ టింగ్" అంటూ టెలిఫోను గంట గదిలో నిశ్శబ్దాన్ని వీపుమీద చరిచింది.

సినిమాకు వెళ్లాలని ముస్తాబు చేసుకొని భర్తరాకకోసం ఎదురుచూస్తున్న లలిత చివాలున లేచి ఆత్రంగా రిసీవర్ అందుకుంది.

నిమిషంసేపు విన్నాక రిసీవర్‌ని బరువుగా బల్లమీద జారవిడిచి కుర్చీలో దిగాలుపడి కూర్చుండిపోయింది. ఉప్పొంగే ఉత్సాహంమీద ఒక్కసారిగా చన్నీళ్లు గుమ్మరించినట్లయింది. అనుకోని ఆశాభంగంవల్ల లలితకి కళ్ళనీళ్ళ పర్యంత మయింది. ఇద్దరం కలిసి సినిమాకి వెళ్దామని చెప్పి వెళ్ళినభర్త అనుకున్న కార్యక్రమాన్ని తారుమారు చేశాడు. ఆ రోజే ఆయన అత్యవసరమైన పనిమీద ఏదో వూరు వెళ్ళాల్సివచ్చిందట. తను వచ్చేసరికే పెట్టె సర్ది, పరుపుచుట్టి సిద్ధంగా వుంచాలిట.

ఇటువంటి ఆశాభంగాలు లలితకి కొత్తకాదు. కాని, ఎందుకో ఇవాళ ఈ చిన్న సంఘటన ఆమెని తల్లక్రిందులు చేసివేస్తోంది. పోనీ, 'ఒక్కత్తెనే వెళ్ళిపోతాను సినిమాకి' అనుకుంది. ఆయన సామాను ఆయనే సర్దుకుంటాడు అనిపించింది. కాని ఒక్కత్తే ఎప్పుడూ గడప దాటి ఎరగదు. సంకోచంతో మనస్సు వెనక్కు లాగుతోంది. అయినా సినిమాకి వెళ్ళకపోతే

మునిగిపోయేదేముంది? అని మనస్సుని ఓదార్చుకోవాలని చూసింది. కాని, దెబ్బతిన్న మనస్సు చికాకుతో, నిస్పృహతో ఆక్రోసిస్తోంది. జీవితంలో ఏ అనుభవం లేకపోయినా మునిగి పోయే దేమీ ఉండదు. వసంతంలో చిగురాకుల గుసగుసలు వినకుండానే తన బతుకు ఆకులు రాలిన మోడయిపోయింది. ఆగని వేగంతో కాలం పరుగెత్తిపోతుంది. తనుమట్టుకు ఇంతే... తన బతుకు ఎప్పుడూ ఇంతే...

పెట్టెలో బట్టలుసర్ది, పరుపు చుట్టిపెట్టి భర్త ప్రయాణానికి అన్నీ అమర్చిపెట్టాలి. ఇందుకే ఈ సిరిసంపదలు తూగే ఇంట్లోకి తనలాంటి నిర్భాగ్యురాలు అడుగుపెట్టింది. తన అదృష్టాన్ని చూసి పెళ్ళినాడు బంధువులంతా ముక్కున వేలు వేసుకున్నారు. తల్లిదండ్రులు పోయినప్పటినుంచీ తన బరువు మోసిన మామయ్య, ఈ రెండోపెళ్ళి ప్లీడరుగార్ని వరుడుగా వెతికి తెచ్చాడు. ఇక తన బాధ తీరిపోయినట్టుగా తిరిగి చూడటంకూడా మానేశాడు మామయ్య. మామయ్య తనకి చదువు సంగీతాలు చెప్పించి కన్నకూతురులాగా పెంచాడు. అయన గుండెలమీద కుంపటిలాగా తను ఎంతకాలం కూచోటం? అందుకే తను మామయ్య మాటకి ఎదురు చెప్పలేదు. తనకి జీవితంలో గొంతెమ్మకోరికలు లేవు. మితిమీరిన కోరికలు కొరివిదయ్యాలని మామయ్య అనేవాడు.

ఆలోచన గాడి తప్పిద్దామని లలిత లేచి ఉత్సాహం తెచ్చుకుంది. భర్త ప్రయాణానికి అన్నీ సిద్ధంచేసింది. ఇంకా భర్త రాలేదు. లలిత సోఫాలో కూచుని ఒకసారి చూపులని

ఇంటిచుట్టూ పరుగెత్తించింది. పైన గిరగిర తిరిగే పంకాలు, షెడ్డులో కారు, దివాణమంత మేడ, ఇంటినిండా మెత్తని ముఖమల్ సోఫాలు. ఓ! నిజంగా తన అదృష్టానికేం కొరవ?

అంతా అదే అంటారు. ఇతరుల దృష్టిలో తనంతటి భాగ్యశాలి లేదు. కాని, ఇన్నివున్నా ఏదో అసంతృప్తి, ఏదో తెలియని వేదనా, వేరుపురుగులాగా తనలోపల తొలిచివేస్తున్నయ్. ఇంత సిరి సంపదల మధ్యా లలిత జీవితం లోతు తెలియని చీకటిబావిలాగా నోరు తెరుచుకొని ఆవలిస్తున్నట్లుంది. అంత విశాలమైన భవనంలో గంతులువేస్తూ చిఱునవ్వులు విరజిమ్మే పసిపాపలులేరు. పద్దెనిమిదేళ్ళ సవతికూతురు శశిరేఖ ఒక్కత్తే తనకి ఆ కొంపలో తోడుగావుంటుంది. భర్త యింట్లో ఉన్నా లేకపోయినా ఒకటే. ఎప్పుడూ తన గొడవల్లో తను మునిగి తేలుతూ వుంటాడు. వచ్చేపోయేవాళ్ళతో ఆయనికి క్షణంకూడా తీరదు. కోర్టునుంచి రాగానే క్లబ్బు. తొమ్మిదింటికి యింటికి తిరిగివస్తాడు. రోజూ ఏదో సభ. ఏదో హడావిడి. ఆయన లేనిదే ఆ వూళ్లో ఏ పనీ జరగదు. ఏ సంస్థా నడవదు. ఊపిరి సలపని ప్రాక్టీసుతోపాటు, ఊళ్లో గొడవలన్నీ నెత్తిన వేసుకొని ఉక్కిరిబిక్కిరయిపోతూ వుంటాడు. కాస్సేపయినా తనతో సావకాశంగా, సంతోషంగా గడపడు. ఒక్కనాడైనా తనని చిఱునవ్వుతో సరసంగా పలకరించే ఎరగడు. అరచేతి మందాన వుండే అద్దాలలోంచి కొట్టొచ్చినట్లు తొంగిచూసే ఆ గుడ్లూ, నెరిసిపోయిన ఆ జుట్టూ, ముడతలు పడుతూ ఘూనంగా, గంభీరంగా వుండే ఆ ముఖమూ చూసేసరికే లలి

తకి హడలు పుడుతుంది. ఆయన తనని పల్లెత్తుమాట అనక పోయినప్పటికీ, మొద్దు కళ్ళద్దాలలోంచి అర్థంకాకుండా చూసే ఆయన చూపులకే లలిత బెదరిపోతుంది. ఆర్భాటం లేకుండా హూనంగా ఆయన తనమీద ఏదో ఎదురుతిరగలేని అధికారాన్ని చెలాయిస్తున్నట్లుంటుంది...

ఆయనకి ఏ వేళకి కావలసిన సదుపాయాలూ, సౌకర్యాలూ ఆ వేళకి యంత్రంలాగా అందిస్తూ వుంటమే తన విధి. ఈ కర్తవ్యం ఏ దాసీ అయినా నెరవేర్చగలదేమో ననిపిస్తుంది. అంతకు మించిన తాహతు ఆ యింట్లో తన కేమైనా వుందా ?

గోడలికి అందమైన రంగుల బొమ్మలు వేళ్లాడుతున్నయ్. నేలమీదపూలతివాచీలు పరుచుకున్నయ్. ఈ జీవంలేని అలంకారాలతో పాటే తనుకూడా ఆ యింటికి. తన భర్త జీవితంలో తనకి ఎక్కడా చోటున్నట్లు కనిపించదు. ఆయన గందరగోళపు లోకానికి ఎడంగా, ఒంటరిగా, ప్రవాసిలాగా తను బతుకుతోంది. ఆయన దృష్టిలో ముఖమల్ సోఫాకీ, తనకీ ఏమైనా తేడా వుందీ ? బ్యూక్ కారుకీ, తనకీ ఏమైనా తేడా వుందీ ? ఆయనికి ఆనందాన్ని అందించే నిర్జీవమైన యంత్రాలతోపాటే తనూ ! ఆయన ఆస్తి ! బ్యాంకులో వున్న డబ్బుమీద చెలాయించే అధికారమే ఆయన తన యౌవనంమీద చెలాయిస్తున్నారు అంతే...

లలితకూడా చదువుకున్నది. జటిల సమస్యలని విడదీయటంలో సాయపడగల వివేకం ఆమెకుంది. ఆమె హృదయం ఆప్యాయమైన పలవరింపుకోసం, అనురాగంతో నిండిన

గుర్తింపుకోసం అలమటిస్తోంది. కేవలం కారులో షికార్లు, టెష్యూ చీరెల నిగనిగలూ, ధనిక జీవితపు దర్పాలూ తృప్తి పరచలేని కోమల హృదయం, లలితలో ఘోషిస్తున్నదని భర్త గుర్తించలేకపోయాడు. ఈ విధవం లలిత జీవితానికి పండు వెన్నెల కావటానికి బదులు, రోహిణిలో మండుటెండలాగా నిప్పులు చెరుగుతోంది. జీవితం బీటలువారిన పొలంలాగా నెర్రెలు విచ్చిపోతూంది. ఏదో దుస్సహమైన పిపాస లోపల రగిలి పోతోంది.

బూట్ల చప్పుడు విని లలిత త్రుళ్ళిపడింది. "సామాను సర్దటం అయిందా ?" అన్నాడు భర్త. భద్రయ్యా పెదిమలతో స్పెన్సరు చుట్టని బిగబట్టి. సింహగర్జన విన్న లేడిపిల్ల అయింది లలిత. తలవంచుకొని "ఆc" అన్నది.

"డ్రైవర్, సామాను కారులో పెట్టూ. టైమవుతోంది వెళ్లొస్తా" అన్నాడు భర్త.

"మళ్ళీ ఎప్పుడు వస్తారు ?" అంది బెదురుతూ లలిత.

"చెప్పలేను. వారం పదిరోజులు పడుతుంది." అని వెనక్కి తిరిగి చూడకుండా అన్నాడు. కారు కదిలింది.

అక్కడే నిలబడిపోయిన లలిత మనస్సు జ్వరపు రోగి నాలుకలాగా చేదెక్కి పోయింది. ఆ యిల్లూ, తోటా అన్నీ గిరగిర తిరిగే సుడిగుండం లాగా కళ్ళముందు కదలిపోతున్నయ్. మోయలేని బరువుతో ఒంటరితనం లలితని అణచి వేయ సాగింది. ఎన్నడూ లేని దౌర్బల్యంతో లలిత వాణికిపోయి కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ నిలబడింది.

"శశీ! శశీ!" అంటూ పిలుపు వినిపించింది. గిరుకున వెనక్కి తిరిగి చూసింది లలిత. చిరునవ్వుతో మధుసూదన రావు కంటబడ్డాడు. బెదురుతూ, సిగ్గుతో వెనక్కి అడుగు వేస్తున్నాడు. అతని నొక్కుల క్రాపు పచ్చటి నుదుటిమీద నల్లమబ్బు పింజలాగా వుంది. స్పోర్ట్సు షర్టులోంచి అతని విశాల మైన ఛాతీ, అందంగా వొంపులు తిరిగిన కండలూ, కిల్లీ నవులు తున్న పెదిమలూ, చేతులో టెన్నిస్ బ్యాటూ — తనతో మాట్లాడటానికి అతని ముఖంలో బెరుకూ, అతని కళ్ళలో సంకోచమూ కనిపించినయ్.

"శశి ఇంకా కాలేజీనించి రాలేదు" అన్నది లలిత.

"అయితే శశి వచ్చాక ఈ ఆహ్వానం ఇస్తారా? శ్రమ యిస్తున్నందుకు క్షమించండి" అన్నాడు ముఖమంతా తియ్యగా మెరిసే చిరునవ్వుతో మధు.

ఆహ్వానం మీదికి చూపులు పరుగెత్తించి "నేనుకూడా రావచ్చునా మీ నాటకానికి" అని అడిగింది.

"ఓ! తప్పకుండా రావచ్చును. రావాలి కూడాను" అన్నాడు మధు బతిమాలుకునే కంఠంతో.

"ఎందుకు రానూ? తప్పక వస్తాను" అన్నది లలిత అప్రయత్నంగా తన చూపులలో విలాసాన్నీ తన కంఠంలో మాధుర్యాన్నీ నింపుతూ.

ఇంచు మించు అయిదారు నెలలనించి మధు ఆ ఇంటికి వస్తూ పోతూ వున్నాడు. భద్రయ్యగారి దగ్గర మధు ప్లీడరు తరిఫీదు పొందుతున్నాడు. అతని చెల్లెలూ, శశీ కాలేజీలో

ఒకటే క్లాసు. అందువల్ల శశితో అతనికి స్నేహం కలిసింది. కాని, భద్రయ్యగారి భార్య ఇంతవరకూ అతని కంటపడలేదు. ఇంత చనువుగా పలకరిస్తుందని మధు అనుకోలేదు. ఆమె అందానికి మధు చకితుడై పోయాడు. ఇంత చిన్న భార్య భద్రయ్యగారికి వుంటుందని మధు కలలోకూడా తలచలేదు.

"మరి తప్పకుండా వస్తారు కదూ? మరచి పోకండేం?" అంటూ వెనక్కి చూచాడు మధు సైకిలుమీదినించి. "అల్లాగే" అని లలిత తలవూపింది. ఏదో ఆనంద తరంగంమీద తేలిపో తున్నట్లుగా—

## 2

ఎన్నడూ రాని పిన్ని తనతో నాటకానికి బయలు దేరడం చూసి ఆశ్చర్యపోయింది శశిరేఖ.

నాటకం ఆడుతున్నంతసేపూ, తనచుట్టూవున్న లోకాన్ని మరిచిపోయి ఏదో స్వప్న జగత్తులో విహరిస్తోంది లలిత. పర్షియన్ కవి వేషంలో, సిల్కు తలపాగాతో, తెల్లటి దుస్తులతో, నెరసిన గడ్డంతో, రంగంమీద మధు కనిపించేసరికి లలిత అంతరంగంలో అపూర్వమైన ఆనంద తరంగం చెలరేగి ఆకాశాన్ని తాకినట్లయింది. ఉమర్ ఖయాం పాత్రలో లీనమై పోతూ మధు చేతుల్తో మధు కలశాన్ని పైకెత్తి "నిన్నటి దిగుళ్ళనీ, రేపటి భయాలనీ ఈ పాత్రలో ముంచివెయ్యండి. రండి, ఇదిగో ఆనంద స్వర్గం." అన్నప్పుడు లలిత ఒళ్ళు

తెలియని దానికిమల్లే, అందరికంటే ముందుగా చప్పట్లు కొట్టింది. తనకే ఆ ఆహ్వానమని పొంగిపోయింది. తన జీవితాన్నే ఆ అపూర్వమైన అనుభవం చేతులెత్తి పిలుస్తున్నదని పులకించి పోయింది. గతమంతా చితికిపోయిన చాపలాగా చుట్టుకు పోతోంది. అందని అనుభవాల ఆనందం లలిత చుట్టూ అల్లు కుంటున్న ట్లనిపించింది.

"ఇక వెళ్దామా పిన్నీ ?" అని శశి అనేదాకే లలిత ఈ లోకంలోకి తిరిగి రాలేదు. ఇంటి దగ్గర రాత్రంతా ద్రాక్ష తోటల్లో విహరిస్తున్నట్లుగా, కోకిల పాటలు వింటున్నట్లుగా, వసంత మేఘాలలోకి ఎగిరిపోతున్నట్లుగా కలలు కంటూ నిద్ర పట్టక కొట్టుకుపోయింది. మళ్ళీ మధు ఎప్పుడు కనిపిస్తాడు ? అతన్ని తను ఎల్లా అభినందించాలి? తన ఆనందాన్ని, కృతజ్ఞతనీ ఎలా ప్రకటించాలి ? అతను ఎల్లా వాటిని స్వీకరిస్తాడో ? ఈ ఆలోచనలే లలిత మనస్సులో గంతులు వేస్తున్నయ్.

"శశీ !" అని పిలిచాడు మధు నిన్నటివేళకే. సరిగ్గా నిన్నటి వేషమే. 'తనని పిలిస్తే ఎంతబాగుండును' అనే తలంపు గుండెల్లో దూసుకు పోయింది.

"శశి ఇంకా రాలేదు. ఇవాళ కాలేజిలో ఏదో మీటింగువుందిట. ఆలస్యంగా వస్తానని చెప్పింది" అన్నది లలిత.

మధు వెనక్కి తిరిగి సైకిల్ ఎక్కబోతున్నాడు. తనతో ఎందుకు మాట్లాడకూడదూ ? అంత సంకోచం ఎందుకూ అతనికి ?

"నిన్న మీ నాటకం అద్భుతంగా వుందండి?" అన్నది లలిత. మధు ఆగి "థాంక్స్" అన్నాడు.

"మీ పాత్ర చాలా బాగుంది. మీ పాట ఎంతో హాయిగా వుంది. నే నెంత ఆనందించానో చెప్పటానికి మాటలు చాలటం లేదు" అన్నది చిరునవ్వు మెరిసే కళ్ళతో లలిత.

అప్రయత్నంగా దొరికిన ప్రశంసకి మధు మురిసి పోయాడు. ఏం బదులు చెప్పాలో తెలియక నిలబడ్డాడు.

"లోపలికి రండి" అన్నది లలిత నదురూ బెదురూ లేని మధుర స్వరంతో.

వచ్చి సోఫాలో కూర్చున్నాడు మధు. ఎదురుగా తను యింకో సోఫాలో కూర్చుంది లలిత. పైన పంకా తిరుగుతోంది. ఇద్దరిమధ్యా మౌనం, గోడలు కడుతోంది. "ఇంత ఇంట్లో ఒక్కరూ బిక్కు బిక్కు మంటూ ఎల్లా వున్నారో మీరు?" అన్నాడు మధు. ఆ మాటలు ఆప్తబంధువు పలకరించినట్లు, తాపంతో మండే వొంటిమీద పన్నీరు చిలకరించినట్లువున్నయ్.

"ఏం చేస్తాను? ఏమీ తోచటంలేదు" అన్నది లలిత. ఎవరో దగ్గరి చుట్టంతో తన సొద వెళ్ళబోసుకుంటున్న ధోరణిలో. తన ఒంటరితనం మీద అతను చూపిన సాను భూతి లలిత హృదయానికి చల్లగా సోకింది.

'ఏం చేస్తాను' అన్న మాటల్లో నిస్పృహా, నిస్సహాయతా మధు మనస్సుకి సూటిగా తగిలినయ్. కాని, ప్రసంగం మళ్ళీ ఆగిపోయింది. మౌనంగా మధు లలితకేసి చూశాడు. దారిలో లలిత చూపులు ఎదురయినయ్. గంటల తరబడి మాట్లాడినా

తరగని సంగతు లెన్నో ఆ మూగచూపుల్లో కరిగి ఇద్దరి మన సులమధ్యా వంతెనలు వేసినయ్. విశాలమైన భవనంలో, నిశ్శబ్దమైన పరిసరంలో వాళ్ళిద్దరి హృదయాలూ ఒకరాగంలో లీనమయే స్వరాల్లాగా పులకరించి పోతున్నయ్.

"వెళ్తాను మరి" అని మధు లేచాడు. లలిత జాలి తొణికే చూపులతో అతనికి వీడ్కోలు యిచ్చింది.

మధు గేటు దాటకముందే శశిరేఖ ఎదురు వచ్చింది. "వెళ్ళిపోతున్నావేం మధూ?" అన్నది.

"ఇందాకటినించీ నీకోసమే ఎదురు చూస్తూ కూచుని విసిగి వెళ్తున్నాను" అని మధు సైకిల్ ఎక్కాడు.

ఆ మాటలకి లలిత కంపించింది. ఇంతసేపూ శశి కోస మేనా అతను కూర్చుంది? తనతో ఎందుకు మాట్లాడాడు? ఎందుకు సానుభూతి వెళ్ళబోశాడు? మధుమీద లలితకి కోపం వచ్చింది. తనతో కపటనాటకం ఆడుతున్నాడని మండిపడింది.

కాని, ఆ కోపమంతా మర్నాడు చప్పగా చల్లారి పోయింది. మధు తనకి ఎన్నో పుస్తకాలూ, పత్రికలూ చదువు కోటానికి తెచ్చియిచ్చాడు. తన ఒంటరితనాన్ని గ్రహించి తన బాధని అనునయించటానికి పూనుకున్న వ్యక్తి ఒక డున్నాడని తెలియగానే లలిత మనస్సు ఎగిరి గంతువేసింది.

ఆ రోజు కోర్టునించి తొందరగా వచ్చేసి లలితకి ఏవేవో కబుర్లు చెప్పాడు మధు. దానిమ్మ గింజల్లాంటి పళ్ళ వరుసలోంచి లేతమామిడి చిగుర్లలాటి పెదిమల్లోంచి తేనెల సోనలు జాలు వారు తున్నట్లనిపించింది. అతను మాట్లాడుతుంటే, ప్రాణ

మంతా బిగబట్టి ఆత్రంగావింది లలిత. అతని ప్రతి మాటా ఒక వెన్నెలబాట. ప్రతి వాక్యంలోనూ ఏదో చమత్కారం. ఏదో బలమైన ఆకర్షణ. దాపరికం లేకుండా పసిపిల్లాడిలాగా అన్నీ చెప్పేకు పోతున్నాడు. ఎందరో యువతులు తనకోసం తపస్సు చేస్తున్నారట. తనకి ఎవరూ లేరుట. ఇప్పుడే పెళ్లి చేసుకో దలచ లేదుట.

నౌకరు కాఫీ తెచ్చి ముందుపెట్టి వెళ్ళాడు. లలిత పట్టుదారాల్లాగా సాగుతున్న పొగకేసి చూస్తూ "ఇవాళ మంచి సినిమా లేమీ లేవా?" అని అడిగింది.

"ఎందుకు లేవు? ఫోన్ చేసి సీట్లు రిజర్వు చేయించనా?"

"అల్లాగే మరి" అని లలిత లోపలికి వెళ్ళిపోయింది.

మధు ఇంటికి వెళ్ళి వేషం మార్చుకుని గ్లాస్కో పంచతో, సిల్కులాల్చీతో తయారయి వచ్చాడు. వచ్చేసరికి వీధిలో శశి నిలబడివుంది. "హలో డార్లింగ్! అల్లా మూడీగా వున్నావేం?" అని పలకరించాడు. శశి పలక లేదు. ముఖం తిప్పేసుకుంది. "ఫిలింకి పోదామా?" అన్నాడు మధు.

"నే నెందుకులే మధ్య..." అన్నది శశి కనుబొమలు చిట్లిస్తూ.

సినిమాకి ముస్తాబయి వచ్చిన లలిత శశి మాటలకి విస్తుపోయింది. కొరడా మొహాన చరిచినట్లయింది. "సరదాగా వెళ్దాం రావమ్మా శశీ!" అని ఎంతో బతిమాలుకుంది లలిత.

శశి పట్టిన కుందేలుకి మూడే కాళ్ళు. ఆ పిల్ల మనస్సు తిప్పి మాట వినిపించటం ఎవరితరమూ కాదు.

"నాకు చచ్చే తలనొప్పిగా వుంది" అని గది తలుపులు బిడాయించి ముసుగుతన్ని పడుకుంది.

క్షణంసేపు తటపటాయించి చివరకి వెళ్ళటానికే నిశ్చయించుకుంది.

సినీమా హాల్లో బాక్సులో కూర్చున్నారు. కథ అంతా ముందుగా మధు వివరించాడు. కూల్ డ్రింక్స్ తెప్పించాడు. వద్దంటే బతిమాలాడు. తాగింది తప్పనిసరి అయ్యేసరికి.

సినిమా ఆరంభం కాగానే మధు దగ్గరికి జరిగాడు. తను ఎడంగా జరిగి కూర్చుంది. కొంతసేపటికి చీకట్లో తన చేతికోసం అతని చేతివేళ్ళు వెతుక్కుంటున్నట్లు లలిత కనిపెట్టింది. కథ మంచి పట్టులోకి వస్తోంది. తన్మయమై చూస్తున్న లలిత బుజంమీద పాములాగా కదులుతోంది అతని చెయ్యి. ఉలిక్కి పడింది లలిత. ఏమీ ఎరగనట్లు మధు తెరకేసి చూస్తున్నాడు. ఆ స్పర్శ లలిత నర నరాల్లో విద్యుద్వేగంతో పాకిపోతోంది. అరిచి అల్లరి చెయ్యాలనుకున్న లలిత చివరికి అలాగే కూర్చుండిపోయింది. అతని చేతివేళ్ళని తన వేళ్ళతో మృధువుగా నిమిరింది. కొత్త ధైర్యంతో మధు లలిత లేత నడుముని చేతుల్తో చుట్టివేశాడు. తప్పించుకుని ఎడంగా జరిగింది.

కారులో తనని ఇంటిదగ్గర దిగవిడిచి వెళ్తూ మధు "గుడ్ నైట్, లలితా!" అన్నాడు. అతని చొరవకి ఆశ్చర్యపోతూ లలిత లోపలికి వెళ్ళింది.

కాని, ఆ రాత్రంతా లలిత కళ్ళమీద కునుకులేదు. ఒళ్ళంతా గొంగళిపురుగులు పాకినట్లుగా వుంది. తన సిగ్గులేని

తనానికి, తన తెగువకి తనే విస్తుపోతోంది. సంప్రదాయాలూ, ధర్మాలూ గీసిన గీటు దాటి ఎరగని తనలో ఎందుకీ విద్రోహం? ఎక్కణ్ణుంచి ఒక్కసారిగా వచ్చింది తన కీ సాహసం?"

మధుతో తను ప్రారంభించిన ఈ సిగ్గులేని కలాపానికి అంతెక్కడ? దీనికి తుది ఏమిటి? ఇది తనని ఏ పాతాళ కూపపు చీకట్లోకో విసిరేసి అక్కడ విడుదలలేని చెఱసాలలో తనని కట్టి పడవేస్తే? మధు తాకిన శరీరం సిగ్గుతో మండి పోతోంది. ఇంకోపక్క ఆనందంతో పొంగిపోతోంది. ఏమైనా సరే తను మనస్సుని కట్టేసెయ్యాలి. రసాతలానికి గుంజుకు పోయే అనుభవాల ఆకర్షణకి తను లొంగిపోరాదని అటూ ఇటూ పచార్లు చేసింది.

కాని, ఇన్నాళ్లనుంచీ అడుగునపడిన హృదయం ఆక్రోశిస్తోంది. తను యంత్రంలాగా, దాసిలాగా ఆ యింట్లో ఎలా బతుకుతుంది? భద్రయ్యగారి ఆస్తిలో ఒక భాగంగా, ప్రాణం లేని అలంకారంగా, తను ఆ యింట్లో ఎల్లా కాలం గడుపుతుంది? తన హృదయ స్పందనాన్ని గుర్తించి గౌరవించే హృదయం, తన యౌవనానికి తగిన ఆరాధన, లాలన, తనని ఆశలతో, కలలతో వెలిగే ప్రాణిగా స్వీకరించే సానుభూతి... కావాలి తన కింకేమీ అక్కర్లేదు.

ఇన్నాళ్ళనుంచీ తనని గుర్తించని భర్తమీద, దర్జాలు, హోదాలూ, అధికారం, ఐశ్వర్యం— ఇవే గొప్పవని మురిసే భర్తమీద కసితీర్చుకోటం ఎల్లా? మధుకి చనువిస్తే అతనితో స్నేహం పెంపొందించుకుంటే...

కాని, వొద్దు. వొద్దు అని కొనవూపిరితో ఏదో గొంతు చించుకొని లలిత హృదయంలో అరిచింది. కన్ను పొడుచుకున్నా తెన్ను కనుపించని కారుచీకటి లలిత కళ్ళ ముందు రెక్కలు విప్పుతోంది.

ఒకవంక భర్త...ఇంకొక పక్క మధు. ఎటూ తెగని పోరాటంతో మనస్సు వేసారి పోతోంది.

అందరికంటె ముందుగా లేచినకోడి చీకటిపోయి వెలుగు వొస్తోందని 'క్కొక్కొరోం' మని కూసింది.

## 3

తెల్లారినాక శశిముఖం చూడటానికి చచ్చిన చావుగా వుంది. చీకట్లో జరిగిన రహస్య కలాపాన్ని వెయ్యికళ్ళతో లోకం కనిపెట్టిందేమో, లక్ష నాలుకలతో తనని చీల్చి చెండాడుతుందేమో నని లలిత లోపల వొణికి పోతోంది.

ఆనాడు మధు ఆఫీసుకి రాలేదు. కోర్టునుంచి ఇంటికి పోయేదారిలో ఆగి తొంగిచూసి పోలేదు. అసలిక మధు తనకి కనిపించకపోతే బతికిపోతా ననుకుంటోంది. ఆ క్షణంలో తీయగా హాయిగావున్న స్మృతులు క్షణక్షణానికీ చేదెక్కిపోతు న్నయ్. వాటినికూకటివేళ్ళతో పెళ్ళగించిమేయగలిగితే...వాటిని మాడ్చి మసి చేసెయ్యగలిగితే ఎంత బాగుంటుంది! నిన్న నూతిలోపడ్డ మనిషి కంఠానికిమల్లే వినిపించిన కంఠం ఇవాళ చెవుల్లో గింగురుమంటోంది. ఇంతవరకూ ఎవరిచేతా వేలెత్తి

చూపించుకోలేదు. ఎవరూ తనని పల్లెత్తుమాట అనలేదు. అటువంటి తను...నిజంగా తనేనా నిన్న సినిమాహాల్లో... చీకటిచాటున...ఏమయిపోయింది. తన రక్తంలో కరిగిన తరతరాల కుటుంబగౌరవం? ఏమయిపోయింది తన చదువు. సంగీతాల అదుపు? నిన్న తన కళ్ళముందు ఏదో పొరకమ్మింది. ఏదో మైకంలో తన మనస్సుకి పట్టు తప్పింది. అణగారిన తన అంతరంగం నిన్న అన్ని గొలుసులూ పటపటా తెంపి విరుచుకు పడింది. నిన్న తన రక్తంలో తుపానుపోటు!

ఇవాళ ... ఇక 'ఆ మధు నా కంటబడకుండా వుంటే చాలు' అని మనసారా కోరుకుంటోంది లలిత.

కాని, ఆ సాయంకాలం శశితో కబుర్లు చెబుతూ పకపక నవ్వుతూ చకచక లాడుతూ వొచ్చాడు మధు. వేటగాడిని చూసి బెదిరే లేడిలాగా ఇంట్లోకి పారిపోయింది లలిత. ఆ తడబాటులో నిన్న అతను తెచ్చి యిచ్చిన పుస్తకాలూ, పత్రికలూ తిరిగి ఇచ్చెయ్యాలన్నమాట మరిచిపోయింది. వాటికేసి చూడ బుద్ధి కావటంలేదు. ఏదో లోతు తెలియని పాడునూతి అంచున వున్నట్లు లలిత వొణికిపోతోంది. గట్టిగా గాలి కొట్టినా అందులో పడిపోతానేమోనని ఒకటే దుడుకు?

రాత్రి పది గంటలుకూడా దాటింది. శశి గదిలో దీపం కునికింది. రేడియోకూడ నిద్రపోతోంది. తోటమీదుగా ఎగురుతూ తీతువుపిట్ట అదేపనిగా అరుస్తోంది. గన్నేరు చెట్టు మీద మిణుగురులు నక్షత్రాలు రాలినట్లుగా మెరుస్తున్నయ్. నౌకర్లంతా నిద్రపోతున్నారు. వీధి తలుపుమీద వేళ్ళతో

మెల్లిగా కొట్టిన చప్పుడు, ఆగి ఆగి మళ్ళీ వినిపిస్తోంది. ఎవరా అని లలిత ఆశ్చర్యపోతూ తలుపుగడియమీద చెయ్యి పెట్టి క్షణం తటపటాయించింది. ఎవరైనా పరవాలేదు. మధు కాకపోతే సరి అని దుర్బలంగావున్న మనసు మూలుగుతోంది.

తలుపు తీసీ తియ్యగానే సుడిగాలిలాగా లోపలికి వచ్చాడు మధు. అతని నిశ్వాసపు వేడిలో మూర్ఛపోతానేమో ననిపించింది. కాని, మరుక్షణంలో తొకతొక్కిన త్రాచుకి మల్లే విజృంభించింది లలిత. ఎక్కణ్ణుంచి వచ్చిందో అంత శక్తి! ఒక్క విదిలింపుతో మధు మెట్లమీద తూలి పోయాడు. ఇదంతా బెట్టు కాబోలునని మధు "హల్లో డార్లింగ్!" అంటూ మళ్ళీ మీదికి వస్తున్నాడు.

"గెటవుట్" అని ప్రాణమంతా బిగబట్టి అరిచింది లలిత. రపీమని వీధితలుపు వేసింది. తోటలో ప్రాణాలు దక్కించుకోటానికి పరుగెత్తే మధు అడుగులు, మొరుగుతూ తరుముతున్న కుక్క అరుపూ వినిపించింది.

తలుపువేసిన చప్పుడు పిడుగులాగా వినిపించి శశి ఉలిక్కిపడి లేచి "ఏమిటి పిన్నీ?" అని అరిచింది.

"ఆఁ. ఏం లేదు శశీ! ఎవరో పిచ్చివాడు ఇంట్లో జొరబడుతుంటే గెంటి తలుపు వేశాను" అని అప్రయత్నంగా అబద్ధమాడేసింది లలిత.

ఇంకా తర్జన భర్జనలు చెయ్యకుండా శశి పూరుకుంది. మళ్ళీ కళ్లుమూసుకుంది.

లలిత హృదయం ఎందుకో తేలిక పడుతోంది. తుపాను లోంచి తప్పించుకు బైటపడ్డ నావలాగా మనస్సు తేలిపోతోంది.

కాని, మధు గుర్తుకొచ్చినప్పుడల్లా లలితకు సింహస్వప్నంగా వుంది. తన తిరస్కారాన్ని ఏ విధంగా మధు సహిస్తాడు? ఏ కట్టుకథలో అల్లి తనని బజార్లో పడేస్తే? పరాభవంతో తనమీద పగసాధిస్తే? తను పడిన తొట్రుపాటు ఎటువంటి దారుణమైన ఫలితాలకు దారితీస్తుందో? వేటకుక్కలాగా తనని వెంటాడి లోకపు కొనలదాకా తరుముతుందేమో?

తెలియకుండానే నిద్రవచ్చి ఆవరించింది లలితని.

## 4

తన కాళ్ళకింద అగ్నిపర్వతం ఎప్పుడు బద్దలవుతుందో అనే ఆందోళన లలితని వేధిస్తోంది. కళంకపు మసిపూసుకుని తన జీవితం పెనుభూతంలాగా మారిపోతుందేమోనని లలిత భయపడుతోంది.

కాని, ఈ విషయం ఎక్కడా పొక్కలేదు. మధు గడుసుగా, తెలివిగా, తనని ఎరగనట్లుగా ఎప్పటిమాదిరిగా పరాయివాడిలాగా తప్పుకు తిరుగుతున్నాడు. ఆఫీసుపని చూసుకుని అటే వెళ్ళిపోతున్నాడు. శశితో మట్టుకు కులాసాగా కబుర్లు చెబుతాడు. తనమాటే ఎత్తడు. తనకేసి కన్నెత్తే చూడడు.

ఏమనుకున్నాడో? ఎంత నొచ్చుకొన్నాడో? తను చొరవ ఇవ్వకపోతే మధు సాహసించేవాడా? తప్పు తనదే. క్షమించమని అడిగితే కాని అతనికి న్యాయం చేసినట్లు కాదు. అయినా ధైర్యంలేదు అతనిఎదటపడి, అతన్ని పలకరించటానికి.

పోనీ అత నిచ్చిన పుస్తకాలయినా తిరిగి ఇచ్చేద్దా మనిపించింది. మనస్సు వెనకాడింది. శశిచేత ఇప్పిస్తే? అంత కంటె తెలివితక్కువపని ఇంకేముంటుంది? తను పడిన తొట్రుపాటుకి మూగప్రేక్షకులుగా, నోరులేని సాక్షులుగా అవి తన పెట్టెలో అడుగున నిద్రపోతే వచ్చిన ప్రమాద మేముంది?

అయినా అనుదినం మధుని చూస్తూ, ఆ రాత్రి ఘటనలు నెమరువేస్తూ జీవించటం లలితకి దుర్భరమనిపిస్తోంది. మాటలతో నొప్పించలేదు కాని, శశి కళ్ళలో కనిపించే హేళనా, చులకనా లలిత వొంటిని తూట్లు పడేస్తున్నయ్. ఎక్కడికైనా దూరంగా పారిపోవా లనిపిస్తోంది. తన భర్త భద్రయ్య తొందరగా ఎందుకు తిరిగి రాకూడదూ? వొచ్చి తనని ఈ మధు కనిపించని ఏ సుదూర సీమలకు ఎందుకు తీసుకుపోయి రక్షించకూడదూ? ఈ జారుడు మెట్లమీదనించి తనని ఎత్తుకుపోయి ఏ భద్రమైన ప్రదేశానికో చేర్చి ఎందుకు కాపాడకూడదూ?

విషమపరీక్షలో ప్రతి ప్రాణీ ఇల్లాగే విలపిస్తుంది. కాని, జీవితం పద్మవ్యూహం. ఇందులోంచి బైటపడటం ఎవరితరం?

నిత్యమూ మధుని చూస్తుంటే తన మనస్సు మళ్ళీ పట్టు తప్పితే? అతని అందం తన మనస్సుమీద మత్తుమందు

చల్లితే... తన కళ్ళకి మళ్ళీ మైకం కమ్మితే ... తన రక్తం ఉన్మత్త నృత్యం ఆరంభిస్తే...తను రసాతలానికి అణగారిపోతే?

ఈ మెరపు చూపుల, ఈ చిలిపి నవ్వుల మాంత్రికుడు, ఈ అందమైన వేటగాడు, మధు తన కళ్ళకి కనిపించకపోతే తను నిజంగా బతికిపోతుంది. కాని, అదెల్లా సాధ్యమౌతుంది? అతన్ని గడప తొక్కొద్దంటే అంతా బైటపడిపోయి పెద్ద గొడవ అవుతుందేమో?

మధుని చూస్తూ నిలవరించుకోలేనందుకు లలిత తనని తను ఎంతో నిందించుకుంది. ఏమయినాసరే అతనికి దూరంగా పారిపోవాలని మనస్సు తొందరచేస్తోంది.

అటూ ఇటూ పచార్లుచేస్తున్న లలిత గదిలోకి వచ్చిన శశిని చూసి ఆగిపోయింది చటుక్కున. తనని గురించి ఏమనుకుంటున్నదో శశి? సిగ్గుతో లలిత తలఎత్తిశశికేసి తిన్నగా చూడలేకపోయింది.

"ఏమమ్మా శశీ!" అని పలకరించింది లలిత. "నాన్న ఎప్పుడొస్తారుపిన్నీ?"అని అడిగిందిశశి.లలిత వెల తెలబోయింది. నాన్నతో ఏం చెబుతుందో శశి.

"చెప్పిన ప్రకారం ఈపాటికే రావలసింది. మరి ఎప్పుడొస్తారో యేమో! నీ కేమైనా కావాల్సివుంటే నన్నడగరాదా శశీ?" అని బుజ్జగిస్తూ అన్నది లలిత.

"ఆఁ యేంలేదు. ఊరికే అడిగాను" అంటూ దూసుకుపోయింది శశి.

భయంతో సందేహాలతో కలవరపడుతూ నిలబడి పోయింది లలిత. కిటికీలోంచి వీధి కనిపిస్తోంది. కాళ్ళు లేని కళ్ళు లేని భర్తని బండిలో కూచోబెట్టి మెల్లిగా ఈడుస్తూ, ఏదో పాడుకుంటూ ఇంటింటి దగ్గరా ఆగి, ముష్టి అడుక్కుంటున్న బిచ్చకత్తె కనిపించింది. గబగబా బియ్యం పట్టుకుని వీధిలోకి వెళ్ళింది లలిత. ముష్టి పెట్టింది. ముష్టిది యించు మించు తన వయసే వుంటుంది — నోరార దీవించింది. బండిలో మనిషి "ఇక గుడిసెకి పోదాం. పాపం! ఇంకెంత దూరం ఈడుస్తావు?" అంటున్నాడు.

"అప్పుడేనా?" అంటూ భిక్షుకి ముందుకి సాగుతోంది. బిచ్చగాడి ముఖం కృతజ్ఞతతో మెరిసి పోయింది.

ఎందుకో తెలియకుండానే లలిత కళ్ళు తడిసినయ్. ఆ భిక్షుకి రూపం ఎంతసేపటికీ కళ్ళలోనే మెదులుతోంది. ఏమిటి, ఆ భిక్షుకి భర్తవల్ల పొందే సుఖం? వాణ్ణే అంటిపెట్టుకుని జీవితాన్నంతా ఎందుకలా పాడుచేసుకోవాలి? దాని మొహంలో ఎక్కడా అసంతృప్తి లేదు. విసుగు లేదు. ఆ వికలాంగుని బండిలో తిప్పడంలోనే ఏదో తెలియని ఆనందాన్ని అనుభవిస్తున్నట్లు కనిపించింది. వాడికి సేవచేయటంకంటె ఇంకే సుఖమూ దానికి అక్కర్లేనట్లుంది. ఆ భిక్షుకి ఏం అపేక్షిస్తోంది? ఏ సుఖాలు కోరుతోంది? ఏమీ కోరకపోవటం వల్లనే అంత సుఖాన్ని అనుభవిస్తుందేమో? ఒకళ్ళమీద ఒకరికి ఎంతజాలి, ఎంత అనురాగం, ఎంత సానుభూతి! ఆ అన్యోన్యం ముందు, లోకంలో భోగభాగ్యాలన్నీ తలవొంచుకోవలిసిందే కదూ?

పక్క యింటిదగ్గర భిక్షుకి గొంతు వినిపిస్తూనే వుంది. ఏమీ తిరిగి కోరకుండా తనని తను పూర్తిగా భిక్షుకి భర్త సేవలో సమర్పించుకుని అద్భుతానందంలో తేలిపోతోంది. తీరని కోరికలు పెంచుకొని, ఆరని దాహంతో తను ఎడారిలో ఒంటరి బాటసారిలాగా బతుకు ఈడుస్తోంది. సమర్పణలోవున్న సంతోషానికీ, సుఖానికీ సజీవమైన, సముజ్వలమైన మూర్తిగా లలిత హృదయ ప్రాంగణంలో నిలబడి భిక్షుకి పాడుతూనే వుంది. దాని రూపం చెరిగిపోకుండా కళ్ళలో మెరుస్తోంది.

కళ్ళు తుడుచుకుంటున్న లలిత కారు ఆగటం విని త్రుళ్ళిపడింది. భర్త భద్రయ్య తడువుకుంటూ కారు దిగి, డ్రైవరు సాయంతో అడుగు వేస్తూ తడబడుతున్నాడు.

చివాలున లేచి నిలబడి లలిత తన కళ్ళని తను నమ్మలేకపోయింది. భద్రయ్యకు తన చెయ్యి ఊతగా అందించింది.

## 5

ఏటేటా భద్రయ్య చూపు మందగించి పోతూవుంది. కళ్ళద్దాలు మందం అవుతున్నయ్. ఇంచుమించు అంధుడై పోయేస్థితి వచ్చేసింది.

కొమ్ములు తిరిగిన డాక్టర్లు పరీక్ష చేసి పెదిమలు విరిచారు. అంతా ఏకగ్రీవంగా విశ్రాంతి అవసరమని చెప్పారు. ఊపిరి సలుపని కార్యకలాపాలన్నీ కట్టిపెట్టాలని సలహా యిచ్చారు. నెల తిరిగేసరికి వేలు కుమ్మరించే ప్లీడరీ వృత్తికి

యింతటితో స్వస్తిచెప్పకపోతే చూపు కాస్తయినా వచ్చే ఆశ లేదన్నారు.

వాళ్ళ సలహా ప్రకారం భద్రయ్య ఒక టొకటిగా జంజాటాలన్నీ వొదులుకొని బైటపడుతున్నాడు. తన కేసులన్నీ మధుకి అప్పగించేశాడు. ఇన్నాళ్ళనించీ ఎడతెగని కార్యక్రమాలతో అతలాకుతలమైన ప్రాణం ఒక్కసారిగా చెఱసాల లోంచి బైటపడ్డట్లుగా 'అమ్మయ్యా!' అని నిట్టూర్చింది. శరీరం బలహీనమై పోవటంవల్ల, లోపల దాగిన ఉబ్బసం ఒక్కమాటు చెలరేగి, తనదే పైచెయ్యి అని నిరూపించుకుంది.

ఆయాసం కొంచెం తగ్గాక భార్యని పిలిచి మనం ఏదైనా పల్లెటూరికి, సముద్రపుబడ్డున చల్లగా హాయిగా వుండే వూరికి వెళ్దామన్నాడు.

లలిత ఒక్క గంతేసి అంగీకరించింది. "కాని శశి పరీక్షలు కావాలిగా" అన్నది.

భద్రయ్య క్షణం ఆలోచించి "శశిని హాస్టల్లో చేర్పిస్తాను. మనం వెళ్దాం" అన్నాడు.

ఇట్టే సామానంతా సర్దేసి లలిత ప్రయాణం కట్టింది. కూడా నౌకర్లెవరూ అక్కర్లేదని లలిత పట్టుపట్టటం చూసి, భద్రయ్య ఆశ్చర్యపోయాడు. ఇద్దరే బయలుదేరారు. సాగనంపటానికి శశితోపాటు స్టేషనుకి వచ్చిన మధు, లలితతో మాట్లాడకుండా సరిగ్గా కంటబడకుండా తప్పుకొని తిరిగాడు. లలిత అతనికేసి చూడకుండా ముఖం తిప్పేసుకుని కూర్చుంది.

రైలు కదిలింది. ఆ భిక్షుకిరూపం ఎందుకో లలిత కళ్ళ ముందు మెదిలింది. దాని దీనమైన పాట లలిత గుండెల లోతుల్లో రింగుమంటోంది.

తను కోరుకున్నట్లుగానే మధునుంచి దూరంగాపోయే అవకాశం దొరికినందుకు లలిత పొంగిపోతోంది. తనూ భర్తా తప్ప ఎవరూలేని సుదూర సుందరలోకానికి ఎగిరిపోతోంది. అక్కడ తన జీవితంలో క్రొత్త అధ్యాయం ఆరంభమౌతుంది. అవును, అందుకే కాబోలు భిక్షుకిరూపం కళ్ళముందు వెలుగు బాటగా తళుక్కు మంటున్నది!

## 6

సముద్రపు హోరుకి భద్రయ్య నిద్రలేచాడు. మసక కళ్ళకి అది రాత్రో ఉదయమో తెలియదు.

"లలితా!" అని పిలిచాడు.

అప్పటికే లలిత లేచి కాఫీ కాస్తున్నది. "వొస్తున్నా! మొహం కడుక్కోటానికి నీళ్ళు తెస్తున్నా. తొందరపడి మంచం దిగకండి" అన్నది లోపల్నుంచి.

"ఎందుకంత భయం? లేవను లే" అని నవ్వుతూ భద్రయ్య బదులు చెప్పాడు.

పసిపిల్లాడికి మాదిరిగా పళ్ళుతోమించి, ముఖం తువ్వాలుతో తుడిచి, పక్కనున్న పేముకుర్చీలో కూర్చోబెట్టి, నిమిషంలో వెచ్చటి కాఫీ తెచ్చి చేతి కందించింది. "పంచదార సరిపోయిందా?" అన్నది.

"అద్భుతం! ఇల్లాంటి కాఫీ నే నెప్పుడూ తాగలేదు!" అంటూ పక్కన నిలబడ్డ లలిత వీపుమీద చేత్తో నిమిరాడు. లలిత హృదయం సముద్రంలాగా పరవళ్లు తొక్కింది.

భోజనంచేస్తూ భర్త "ఇందులో అమృతంవేసి వండి నట్లుగా వుందే?" అన్నప్పుడు, లలిత పైకి "ఏదో అలవాటు లేని వంట! ఎందుకు లెండి అంత వేళాకోళం" అంటుంది. కాని లోపల పట్టలేని సంబరంతో మురిసిపోతుంది.

మధ్యాహ్నం భర్తకి పేపరు చదివి వినిపిస్తుంది. టపా రాగానే ఉత్తరాలు చదివి వినిపిస్తుంది. భర్త మధ్యాహ్నం నిద్రపోతుంటే కిటికీదగ్గర నిలబడి దూరాన కెరటాల ముత్యాల వానలా కురిసే వెలుగుని చూస్తూ నిలబడుతుంది. గుడిసె చుట్టూవున్న కొబ్బరిచెట్లమీద చిలకలూ, పిచ్చుకలూ చేసే అల్లరి వింటూ వుంటుంది. కిటికీలోంచి ఎదురుగా వున్న గోడ మీద తరంగాలలాగా నాట్యంచేసే వెలుతురుని చూసి మురిసి పోతోంది. ప్రశాంతంగా పరుచుకున్న నీలాకాశం ఏదో తెలియని మధువుని తనమీద వర్షిస్తున్నట్లనిపిస్తుంది. తనూ భర్తా ఏదో స్వప్నలోకానికి ఎగిరివచ్చి నివాస మేర్పరచు కున్నట్లుగా పులకించి పోతుంది.

ఎండ బాగా తగ్గిపోయాక భర్త చెయ్యి పుచ్చుకుని సముద్రపు ఒడ్డున ఇసుకలో ఎంతో దూరం షికారుకు తీసుకు పోతుంది. పాదాలదాకా పాకివచ్చి నురుగుతో కెరటాలు చల్లగా కాళ్ళని తగులుతుంటే భద్రయ్య లలిత చెయ్యి గట్టిగా పట్టుకుని "నన్నెక్కడికి తీసుకుపోతున్నావు లలితా!" అన్నాడు.

"మరో ప్రపంచానికి" అన్నది లలిత.

భద్రయ్య గంభీర వదనంలో చిఱునవ్వు మెరిసింది. "ఆ ప్రపంచంలో నన్ను ఒంటరిగా వొదిలేస్తా వేమోనని నా భయం?" అన్నాడు.

"అల్లా ఎన్నటికీ జరగదు" అన్నది లలిత భర్త చెయ్యి గట్టిగా పట్టుకుని.

"నీ ఋణం ఎల్లా తీర్చుకోగలను?" అన్నాడు వొణికే గొంతుతో భద్రయ్య.

"ఇంత మాత్రానికేనా? ఆ మాట అనకండి. ఋణం లేదు, గిణం లేదు. పదండి యింటికి" అని వెనక్కి తిరిగింది లలిత.

రాత్రి భోజన మయింది. భద్రయ్య పడుకున్నాడు. నిద్రరాక లలిత మామయ్య నేర్పిన మీరా భజన కీర్తన అందుకుని గొంతెత్తి పాడింది. నిశ్శబ్దం ఆ పాటతో పులకించింది.

పాట ముగియగానే భద్రయ్య "ఈ గుడిసెలోకి దారి తప్పి కోకిల ఎగిరి రాలేదుకదా?" అన్నాడు.

"ఎందుకండి అంత హేళనా?" అన్నది లలిత చాప మీదికి వాలుతూ.

భద్రయ్య ఆశ్చర్యంలో పడి ఉక్కిరి బిక్కిరవుతున్నాడు. 'ఈ లలిత పదేళ్ళనుంచి తనతో కాపరం చేస్తున్న వ్యక్తేనా? ఎవరైనా కొత్త మనిషి కాదు కదా కొంపతీసి? ఈ వ్యక్తినేనా తను యింతకాలం చులకనగా, నిర్లక్ష్యంగా ప్రాణంలేని యంత్రంలాగా అగౌరవించింది?'

"భద్రయ్య లలిత ముఖాన్ని మనస్సులో చిత్రించు కుంటూ, తన అదృష్టాన్ని అభినందించుకుంటూ నిద్రపోయాడు.

చలిగాలి తోలుతుంటే లేచివెళ్ళి భర్తకి ఉత్తరీయం మెల్లిగా కప్పివచ్చి పడుకుంది లలిత.

* * *

"ఇవాళ ఎన్ని ఉత్తరాలొచ్చినయ్ లలితా?"

"నాలుగూ"

"ఏవీ, చదువూ—"

"ఒకటి ఇన్స్యూరెన్సు కంపెనీనించి, రెండోది బ్యాంకు డైరెక్టర్ల మీటింగును గురించి, మూడోది ఎవరో కవిగారి షష్టిపూర్తి మహోత్సవానికి ఆహ్వాన సంఘానికి అధ్యక్షుడుగా వుండమని కోరుతూ."

"తరవాత" అన్నాడు భద్రయ్య.

లలిత ముఖం వివర్ణమైపోయింది. కాళ్లకింద నేల, నోరు తెరిచి మింగుతున్నట్లుగా వుంది. పెదిమలు వణికి పోతున్నయ్.

ఉత్తరం ఊరూ పేరూ లేని ఆకాశరామన్న సాక్షి అనే దొంగపేరుతో రాసింది.

"చదువూ" అన్నాడు భద్రయ్య.

ఏం చదువుతుంది? తను భద్రయ్య హృదయంలోవున్న పూజాపీఠం మీదనుంచి దొర్లి మట్టిలో కలిసిపోదూ? వొంట్లో నసిలేని సమయంలో ఈ ఉత్తరం ఆయనకి ఎంత శల్యంలాగా గుచ్చుకుంటుందో? పోనీ యేదో కల్పించి ఎవరో రాసి

నట్లు చదివేస్తే? తనని అంతగా నమ్మి మన్నించే భర్త కళ్లలో దుమ్ము జల్లటం ఎంత నీచం? ఏం చెయ్యాలి? ఏమీా పాలు పోవటంలేదు.

"చదవ్వేం లలితా?" అన్నాడు కొంచెం చిరాకుగా.

"నన్ను క్షమించండి. ఇప్పుడు చదవను"

"ఏం నిద్ర రొస్తుందా?"

"కారణం నన్నడగకండి. మన్నించండి. సమయం వచ్చినప్పుడు తప్పక చదువుతాను. ఇప్పుడు కాదు" అన్నది ఆవేశంతో లలిత.

భార్య కంఠంలో విహ్వలత్వం, గద్గదస్వరం, భద్రయ్యని చకితుణ్ణి చేసినయ్.

'చదివి తీరాలిసిందే' అందామనుకున్నాడు. కాని పసి పిల్లాడిలాగా తనని సాకుతున్న లలిత మనసు నొచ్చుతుందేమో నని సందేహించాడు.

"పోనీ అంతా చదవద్దులే. టూకీగా విషయ మేమిటో చెప్పు" అన్నాడు భద్రయ్య.

"చెప్పటానికి ఇది సమయం కాదు. మీా వొళ్లు కుదట పడి మీా చూపు బాగుపడేదాకా చెప్పను. అప్పుడు తప్పక చెబుతాను. అందాకా ఉత్తరం భద్రంగా అట్టే పెడతాను. నేను మిమ్మల్ని మోసగించను. నా మాట నమ్మండి" అని లలిత భర్త చేతులు పుచ్చుకుని బతిమాలుకుంది.

అంతటితో ఆ విషయాన్ని వొదిలేశాడు భద్రయ్య.

లలితకి మాత్రం ఆఉత్తరం ఒకపీడ కలగా గుండెలమీద కెక్కి కూర్చుని కంఠం నులిమివేస్తోంది. ఎంత ఆలోచించినా ఈ ఉత్తరం శశిరేఖపనే అనిపిస్తోంది. ఈ పల్లెటూర్లో తను నిర్మిస్తున్న నూతన జీవిత సౌధానికి ఈ ఉత్తరం చిచ్చరపిడుగు. తన సుఖం కాలి మసి అయినా సరే కాని భర్త మనస్సు ఈ ఉత్తరానికి ఎల్లా తట్టుకోగలదు? అందుకే లలిత ప్రాణం పోయినాసరే అప్పుడు చదవదలుచుకోలేదు.

ఆ సాయంకాలం సముద్రపు ఇసుకలో నడుస్తూ అడిగింది లలిత 'నేనొకటి కోరుకోనా?' అని.

"ఊఁ, తప్పక" అన్నాడు భర్త.

"పరీక్షలు కాగానే శశిని మధుసూదనరావుకిచ్చి పెళ్ళి చెయ్యండి" అన్నది లలిత.

"నేనూ అదే అనుకుంటున్నాను మనస్సులో. తప్పక చేస్తాను" అన్నాడు భద్రయ్య. ఇవాళ వొచ్చిన ఉత్తరం వీళ్ళిద్దరికీ సంబంధించింది అయివుంటుందనీ, అందుకే లలిత చదవలేదనీ లోపల అనుకున్నాడు భద్రయ్య.

ఆరాత్రి ఎంతోసేపటిదాకా నిద్రపట్టక లలిత కిటికీలోంచి ఆకాశంతో సరసాలాడే కెరటాలకేసి చూస్తూ నిలబడింది. వెన్నెలలో స్నానమాడి జడ విరబోసుకొని తడి ఆరబెట్టుకుంటున్న ముత్తయిదువుల్లాగ కనిపించినయ్ కొబ్బరిచెట్లు. నిర్మలమైన సరోవరంలాగా వుంది ఆకాశం నీలంగా. జాలిగా తన మీదికివొంగి ఆకాశం తన కళ్ళలోకి చూస్తున్నది. ఆకాశమంతటి లోనూ ఆనాటి భిక్షుకి ముఖం నిండిపోయినట్లుగావున్నది.

ఎందుకో అప్రయత్నంగా మధు ముఖం మనస్సులో మెరిసి నిలువునా ఒణికిపోయింది. అతని వేషం... చేతులో మధుపాత్ర...అందులో వుంది విషం కాదుకదా?

* * *

ఎంతో వైభవంగా శశికీ, మధుకీ వివాహం జరిగింది. పెళ్లియిల్లు వాన కురిసి వెలిసినట్లుగావుంది. నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది.

మూడో అంతస్తులో ఒకవైపు కొత్త దంపతులు నవ వసంత మాధుర్యాన్ని కొల్లగొంటున్నారు.

ఇంకోపక్క గదిలో భద్రయ్య ఒంటరిగా నిద్ర పోతు న్నాడు. ఇప్పుడాయన మెట్లు ఒక్కడే ఎక్కగలుగు తున్నాడు. కొంచెం చూపు తేటపడింది.

పిల్లలాగా అడుగులు వేసుకుంటూ లలిత గదిలోకి వెళ్లి లైటు వెలిగించింది. "పడుకున్నారా?"

"ఇప్పుడే కునుకుపట్టింది. ఇంతసేపు ఏంచేస్తున్నావ్?" అన్నాడు భర్త.

"ఏమీలేదు. ఇదిగో ఆనాటి ఉత్తరం"

"ఇప్పుడెందుకులే ఆ గొడవా? తరవాత చూసుకో వచ్చునులే"

"కాదు, కాదు. ఇవాళే మీరు చదివి తీరాలి. సమ యం వచ్చింది."

"ఏదీ—" అని అందుకుని ఒక్క గుక్కలో పూర్తి చేశాడు. తల తిరిగిపోతుంది. గది అంతా గిరగిర తిరుగు తున్నట్లుగా వుంది.

"ఇదంతా నిజమా లలితా?" అని ఆందోళనగా అడిగాడు. "పూర్తిగా అబద్ధంకాదు" అన్నది లలిత ఉద్వేగాన్ని కంఠంలో అణుచుకుంటూ.

భద్రయ్య తల ఎత్తలేకపోయాడు. లలిత సుడిగాలిలో తెరచాపలాగా కొట్టుకుపోతోంది.

"అయితే నాకేం శిక్ష విధిస్తారు? చిరునవ్వుతో స్వీకరిస్తాను" అన్నది. లలిత.

"భద్రయ్య నోటమాట పెగలటంలేదు. ముచ్చెమటలు పోస్తున్నయ్. తన కళ్ళకు వెలుగయిన లలిత, తన ప్రాణానికి అమృతమైన లలిత...అసంభవం.

"చెప్పరేం?" అన్నది లలిత.

భద్రయ్య పెదిమలు వణికి పోతున్నయ్. కణతలు పగిలి పోతున్నయ్. "మీరు చెప్పకపోయినా, నాకు తెలుసు. నాకు తెలుసు" అంటూ బైటికి పరుగెత్తింది లలిత.

చుక్కల్ని చూస్తున్న ఆ మూడంతస్తుల మేడమీద నుంచి చీకట్లో ఏదో బరువుగా కిందపడ్డట్లు "దభీ"మని చప్పుడయింది. కోటంతా ఉలిక్కిపడి నిద్రలేచింది. "లలితా!" అని భద్రయ్య గొంతు చించుకొని అరిచిన అరుపు అర్ధరాత్రి గుండెల్ని చీల్చివేసింది.

చీకట్లో నెత్తురు మడుగు భీకరంగా మెరిసింది.

"నిన్ను క్షమించాను లలితా!" అన్న మాటలు భద్రయ్య గొంతుకలో కొట్టుకున్నయ్. కాని అప్పటికే లలిత మానవుడి క్షమతో అవసరం తీరిపోయింది.